బీఆర్ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

కొత్తగూడెం అర్బన్, మే 25: నల్గొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. విద్యావంతుడు రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని 35వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ రుక్మాగంధర్ బండారి ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు.

చుంచుపల్లి, మే 25 : పట్టభద్రుల ఆదరణ చూస్తుంటే రాకేశ్‌రెడ్డి విజయం తథ్యమని బీఆర్ఎస్ నేత మూడ్ జయరాంనాయక్ అన్నారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా చుంచుపల్లిలో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఆదరణ రాకేశ్‌రెడ్డికి ఎక్కువగా ఉందన్నారు.

పాల్వంచ, మే 25: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ పాల్వంచలో పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం చేశారు. పాల్వంచ పట్టణ పార్టీ అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, పాల్వంచ కో-ఆపరేటివ్ సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేశ్ పటేల్ ఆధ్వర్యంలో కేటీపీఎస్ కాలనీలో, సెంట్రల్ ఆఫీస్ కర్మాగారాలు, గేటు వద్ద కార్మికుడు, ఇంజినీర్లు, పట్టభద్రులందరినీ కలిసి రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు.

సారపాక, మే 25: ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి పట్టభద్రులను శనివారం కోరారు.

మణుగూరు టౌన్, మే 25: ఈ నెల 27న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న విద్యావంతుడు, ప్రజా సమస్యలపై గళమెత్తే ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం ఒక ప్రకటనలో పట్టభద్రులను కోరారు.

అశ్వాపురం, మే 25: ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వెన్నా అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం మండలంలో ప్రచారం నిర్వహించారు.

సారపాక, మే 25: ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కోరుతూ బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్ ఆధ్వర్యంలో శనివారం నాయకులు ఐటీసీ ఎంప్లాయీస్ కాలనీలో ప్రచారం నిర్వహించారు.

కరకగూడెం, మే 25: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పట్టభద్రులని కలిసి ప్రచారం నిర్వహించారు.

భద్రాచలం, మే 25: రాకేష్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ నమూనా బ్యాలెట్ పత్రాన్ని చూపిస్తూ బీఆర్ఎస్ నాయకులు ప్రభోత్‌కుమార్, పూర్ణ చందర్‌రావు ప్రచారం నిర్వహించారు.

ఇల్లెందు రూరల్, మే 25: రాకేశ్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఖమ్మంపాటి రేణుక శనివారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. సుభాష్‌నగర్, బాలాజీనగర్, కరెంటాఫీస్, ఇందిరానగర్, సంజయ్‌నగర్ తదితర ఏరియాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఓటు ప్రాధాన్యత గురించి వివరించారు.

టేకులపల్లి, మే 25: రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు, ముత్యాలంపాడు గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

చంద్రుగొండ, మే 25: నల్గొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఎనుగుల రాకేశ్‌రెడ్డి విజయం ఖాయమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారా వెంకేశ్వరరావు(బాబు) అన్నారు. శనివారం చంద్రుగొండ పంచాయతీలో పట్టభద్రుల ఓట్లు అభ్యర్థించాడు.

దమ్మపేట, మే 24: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గౌరవనీయులనే పెద్దల సభకు పంపుదామని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి పర్వతనేని రామక్రిష్ణ అన్నారు. గ్రామాల్లో దొడ్డా రమేశ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు.

అన్నపురెడ్డిపల్లి, మే 25: రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బోయినపల్లి సుధాకర్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో రాకేశ్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆయన ప్రచారం నిర్వహించారు.

అశ్వాపురం: ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సారపాక: ఐటీసీ ఎంప్లాయీస్ కాలనీలో ప్రచారం

కరకగూడెం: ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


కొత్తగూడెం అర్బన్ : ప్రచారం చేస్తున్న నాయకులు

చుంచుపల్లి : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాల్వంచ : ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

భద్రాచలం: ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఇల్లెందు రూరల్ : ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

టేకులపల్లి : ప్రచారంలో లక్కినేని, వరప్రసాద్‌గౌడ్

అన్నపురెడ్డిపల్లి : ప్రచారం నిర్వహిస్తున్న సుధాకర్‌రావు

దమ్మపేట : ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు


చండ్రుగొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జూన్ 2 నాటికి డ్రెస్సులు పూర్తికావాలి

పాల్వంచ రూరల్ : టైలరింగ్ సెంటర్‌ను సందర్శిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

పాల్వంచ రూరల్, మే 25 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ రెండో తేదీ నాటికి విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టడం పూర్తి చేయాలని అదనపు కలెక్టర్, డీఆర్డీవో విద్యాచందన ఆదేశించారు. మండలంలోని సీతానగర్‌కాలనీలోని డ్రెస్సులు సిద్ధం చేస్తున్న టైలరింగ్ కేంద్రాన్ని ఆమె శనివారం సందర్శించారు. కొలతల ప్రకారం డ్రస్సులు సిద్ధం చేయాలన్నారు. ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఎం రాంబాబు, సీసీ పద్మావతి పాల్గొన్నారు.

పాల్వంచ, మే 25 : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠశాలలు తెరిచే నాటికి యూనిఫాంను కుట్టించి అప్పగించేందుకు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. పాల్వంచ మున్సిపల్ సమావేశ మందిరంలో మెప్మా ఆధ్వర్యంలో విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యతలను అప్పగించి కుట్టే పనులను ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ స్వామి, సెక్రోరియల్ అధికారి సైదులు, మున్సిపల్ డీఈ మురళి, ఏఈ రాజేష్, మెప్మా టీఎంసీ ఉపేందర్, సీవోలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

పాఠశాలలు సుందరంగా ఉండాలి : పీవో

అశ్వారావుపేట రూరల్, మే 25: పాఠశాలలు, వసతి గృహాలు అన్ని సౌకర్యాలతో సుందరంగా ఉండాలని ఐటీడీఏ పీవో ప్రీతీక్ జైన్ అన్నారు. శనివారం మండలంలోని భీమునిగూడెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలకు తిరిగి ప్రారంభమయ్యేనాటికి అన్ని రకాల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈ రామిరెడ్డి, దమ్మపేట ఏటీడబ్ల్యువో చంద్రమోహన్, హెచ్ఎంలు భద్రమ్మ, పద్మ, ధర్మలు పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, మే 25: భద్రాచలం సీతారామచంద్ర స్వామి దివ్యక్షేత్రంలో శనివారం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, తదితర నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం చిత్రకూట మండపంలో నిత్య కల్యాణం జరిపారు.

రామయ్యను దర్శించుకున్న ఈటల

భద్రాచలం సీతారామచంద్రస్వామిని శనివారం సాయంత్రం మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ దర్శించుకున్నారు. అనంతరం తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం టౌన్, మే 25: భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రదానం చేసే పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మ విభూషణ్ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామరెడ్డి తెలిపారు. అర్హత కలిగిన వారు నిబంధనలు, దరఖాస్తులను సంబంధిత వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు.

పాల్వంచలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

పాల్వంచ, మే 25: పాల్వంచలోని కేటీపీఎస్‌లో ఉన్న టీఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో వచ్చేనెల 1, 2 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఇంటూరి రవికుమార్ తెలిపారు. శనివారం పాల్వంచలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 11 నుంచి 19 సంవత్సరాలలోపు యువతీ యువకులు, వెటరన్స్(35 నుంచి 80 సంవత్సరాలు) వయస్సు ఉన్నవారందరూ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ నెల 29వ తేదీ వరకు వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని, ఎంట్రీ ఫీజు సింగిల్స్‌కి రూ.800, డబుల్స్‌కి రూ.వెయ్యి చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 9866793238, 9848275566 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దమ్మపేట, మే 25: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు శనివారం పరామర్శించారు. మండల పరిధిలోని గండుగులపల్లి, గొర్రిగుట్ట గ్రామాలకు చెందిన సోయం నాగేంద్రబాబు, కుంజా నాగేంద్ర బాబు ఇటీవల పట్వారిగూడెంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం విధితమే. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులకు ధైర్యం చెప్పారు.

'విద్యుత్ అంతరాయం రానీయొద్దు'

పాల్వంచ, మే 25: ఎన్‌పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ బీకంసింగ్ శనివారం పాల్వంచలో పర్యటించారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో టీవీని తనిఖీ చేశారు. ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా ఎలాంటి అంతరాయం లేకుండా జరుగుతుందా లేదా అని పరిశీలించారు. ఆస్పత్రికి అదనంగా మరో జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, సోమరాజుదొరకు సూచించారు. ఆయన వెంట డీఈ నందయ్య, ఏడీఈ లక్ష్మణ్, ఏఈ ప్రతాప్‌కుమార్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

29న జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఎంపికలు

దమ్మపేట, మే 25: ఈ నెల 29న దమ్మపేట గిరిజన గురుకుల కళాశాల మైదానంలో జిల్లా అథ్లెటిక్ ఆసోసియేషన్ ఆధ్వర్యంలో పరుగు విభాగంలో ఎంపికలు జరుగుతాయని ఆసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మహిధర్ శనివారం తెలిపారు. అండర్ 8, 10, 12, 14, 16, 18, 20 విభాగాల్లో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన వారు హనుమకొండ జవహర్ లాల్ స్టేడియంలో జూన్ 6న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హులని మహిదర్ అన్నారు. ఆసక్తి యువతీయువకులు 29వ తేదీ ఉదయం 8 గంటలకు మైదానం వద్దకు చేరుకోవాలని సూచించారు. వివరాలకు 7013552707 మొబైల్ నంబరును సంప్రదించాలన్నారు.

సెంట్రల్ లైటింగ్ పనుల్లో నిర్లక్ష్యం

కాంక్రీట్ వేయకుండా మట్టితో నింపిన విద్యుత్ స్తంభాలు

ములకలపల్లి, మే 25: మండల కేంద్రంలో జరుగుతున్న సెంట్రల్ లైటింగ్ పనుల్లో నాణ్యత కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ లైన్లను తొలగించి కొత్త లైన్ కొరకు విద్యుత్ స్తంభాలు ఏర్పా చేస్తున్నారు. దానిలో భాగంగా ఉన్న వాటికంటే ప్రస్తుతం పెద్ద స్తంభాలను వినియోగిస్తున్నారు. స్తంభాలను నిలబెట్టే క్రమంలో కాంక్రీట్‌కు బదులుగా మట్టితో గోతులను నింపుతున్నారు. పనులు ఇంత నిర్లక్ష్యం చేపడితే వానకాలంలో వల్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగే ప్రమాదాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ముగిసిన కౌన్సిలింగ్

పాల్వంచ రూరల్, మే 25: ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని గురుకులాల్లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశం పొందేందుకు కిన్నెరసాని గురుకుల కళాశాలలో శనివారం జరిగిన కౌన్సిలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లాలోని కృష్ణ సాగర్, దమ్మపేట, కిన్నెరసాని, గుండాల, సింగరేణి, తిరుమలాయపాలెంలోని కళాశాలల్లో ప్రవేశం కోసం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.. దాదాపు 358 మంది హాజరయ్యారు. అందరికీ కోరుకున్న కోర్సులో సీట్లు కేటాయించడం జరిగింది. గిరిజన గురుకులాల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ రెండు సంవత్సరాల పాటు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని, గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం అందించే సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉమ్మడి జిల్లాలోని వివిధ గురుకులాల ప్రిన్సిపాల్స్ హరిసింగ్, గోవర్ధన్, జానూనాయక్, పుల్లయ్య పాల్గొన్నారు.

పాల్వంచలో చోరీ

పాల్వంచ, మే 25 : పట్టణ పరిధిలోని కాంట్రాక్టర్స్ కాలనీలో ఓ ఇంట్లో దొంగలు పడ్డారు. దేవినేని రోజా ఇంట్లో చొరబడి సుమారు రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. రోజా ఇటీవల పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. శనివారం పాల్వంచలోని తన ఇంటికి వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా బీరువాలు పగులగొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందర చేసి వెండి, బంగారం ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. పట్టణ ఎస్సై బాణాల రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్డసంచుల్లో విత్తనాలను కొనుగోలు చేయవద్దు

డీఏవో వేల్పుల బాబూరావు

జూలూరుపాడు, మే 25 : రైతులు అధికృత డీలర్ల వద్దే మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసి రశీదులను తీసుకోవాలని, గుడ్డసంచుల్లో విక్రయించే విత్తనాలను కొనుగోలు చేయవద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో) వేల్పుల బాబూరావు సూచించారు. శనివారం జూలూరుపాడు మండల పరిధిలోని మాచినేనిపేట గ్రామంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించేందుకు గ్రామాల్లోకి వస్తే వారి వివరాలను వ్యవసాయ శాఖ అధికారులకు వెంటనే తెలియజేయాలని కోరారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్యాకెట్‌లు, రశీదులను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచి ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట కొత్తగూడెం సహాయ సంచాలకులు దండ రమేశ్, మండల వ్యవసాయశాఖాధికారి రఘుదీపిక, ఏఈవో గోపికృష్ణ తదితరులు ఉన్నారు.

బయట విత్తనాలు కొనుగోలు చేయవద్దు

ఇల్లెందు రూరల్, మే 25: రైతులు బయట వ్యక్తుల వద్ద నుంచి విత్తనాలు కొనుగోలు చేయవద్దని ఏడీఏ వాసవిరాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని సుదిమళ్ళ, సీఏస్‌పీ బస్తీ, కొమ్ముగూడెంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు.

మాట్లాడుతున్న డీఏవో వేల్పుల బాబూరావు

టేకులపల్లి, మే 25: మండలం పరిధిలోని సులానగర్, గోలియతండా, మొక్కంపాడు, చింతోనిచెలక, కొత్తతండా గ్రామాల్లోని రైతులకు విత్తనాల కొనుగోలు, కల్తీ విత్తనాలను గుర్తించడం వంటి విషయాలపై ఏవో అన్న పూర్ణ అవగాహన కల్పించారు.

కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి

చంద్రుగొండ, మే 25: విత్తన కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ అబ్జల్ బేగం అన్నారు. శనివారం మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనే సమయంలో లైసెన్సు కలిగిన దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలన్నారు.

ఆళ్లపల్లి, మే 25: మండల కేంద్రంలో శ్రీ యశ్వంత్ ట్రేడర్స్ విత్తనాల షాపును వ్యవసాయ డివిజన్ అధికారి తాతారావు, ప్రముఖ వ్యాపారవేత్త గౌరిశెట్టి నాగభూషణ రావు శనివారం ప్రారంభించారు.

జీలుగు విత్తనాలు సిద్ధం

దుమ్ముగూడెం, మే 25: దుమ్ముగూడెం సొసైటీ కార్యాలయంలో రైతులకు జీలుగు విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉంచినట్లు మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బూర్గంపహాడ్ సొసైటీ కార్యాలయంలో..

బూర్గంపహాడ్, మే 25: బూర్గంపహాడ్ సొసైటీ కార్యాలయంలో రైతులకు జీలుగులు అందుబాటులో ఉన్నాయని సొసైటీ కార్యాలయం సీఈవో ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్సులతో వ్యవసాయశాఖ కార్యాలయంలో సంప్రదించి టోకెన్‌లు తీసుకుని సొసైటీ కార్యాలయానికి వస్తే రైతులకు జీలుగులు ఇస్తారన్నారు.

నర్సరీని సందర్శించిన డీపీవో

ఇల్లెందు రూరల్, మే 25: నర్సరీ, సేంద్రీయ ఎరువుల తయారీలను డీపీవో వి. చంద్రమౌళి పరిశీలించారు. శనివారం మండల పరిధిలోని బొజ్జాయిగూడెం పంచాయతీలో ఆయన నర్సరీల పెంపకం, క్రీడాప్రాంగణం, పల్లె ప్రకృతివనం, సేంద్రియ ఎరువు తయారీ విధానం, రకరకాల చెట్లు, మొక్కల పెంపకాన్ని సందర్శించారు. పల్లె ప్రకృతి వనంలో నాటిన మొక్కలను పరిశీలించారు.

ఆళ్లపల్లి, మే 25: మండలంలోని పలు ప్రకృతి వనాలు, నర్సరీలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డుల్లో సేంద్రియ ఎరువులు తయారు చేయాలని, వైకుంఠధామాలను వాడుకలోకి తీసుకురావాలని, గ్రామాల్లో పారిశుధ్య పులు ముమ్మరంగా చేపట్టాలన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

కొత్తగూడెం టౌన్, మే 25 : రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(ఎస్ఏటీఎస్) సహకారంతో జిల్లా యువజన, క్రీడల కార్యాలయం భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో ఈ నెల 1నుంచి 31వ తేదీ వరకు జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను ఉచితంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో టెన్నిస్, క్రికెట్, బాబూక్యాంపులోని ఉషు సమ్మర్ క్యాంపును జిల్లా యువజన, క్రీడల అధికారి పరంధామరెడ్డి సందర్శించారు. ఈ సమ్మర్ క్యాంపును వినియోగించుకున్నందుకు కోచ్‌లను అభినందించారు. క్రీడాకారులుగా ఎదగడానికి అవకాశాలున్నాయని, నిరంతర సాధన ద్వారా జిల్లాకు, రాష్ట్రానికి మంచిపేరు తేవాలని ఆయన సూచించారు.

ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేయాలి

భద్రాచలం, మే 25: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులర్ పోస్టులకు కన్వర్షన్ చేసి పర్మినెంట్ చేయాలని రాష్ట్ర యూనిటైడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు భద్రాచలం డీఈ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించి, వినతి పత్రాన్ని డీఈ జీవన్‌కుమార్‌కు అందజేశారు. ధర్నానుద్దేశించి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే బ్రహ్మచారి, యూఈఈయూ జిల్లా కార్యదర్శిం బొల్లి వెంకటరాజు మాట్లాడుతూ మూడు దశాబ్దాలకు పైగా బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్లర్లు సంస్థను నమ్ముకొని పనిచేస్తున్నారని గుర్తు చేశారు. వారికి కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు కౌన్సిలింగ్

రామవరం, మే 25 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు క్వార్టర్ల కోసం శనివారం యాజమాన్యం కౌన్సిలింగ్ నిర్వహించింది. ఈ కౌన్సిలింగ్‌కు 101 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారు. వారి అర్హత, కేటగిరి, పదవిని ఆధారంగా చేసుకొని పూర్తి పారదర్శకతతో క్వార్టర్ల కేటాయింపునకు కౌన్సిలింగ్ జరిగింది. 101 దరఖాస్తులకు గాను 49 మంది క్వార్టర్లకు అర్హత సాధించగా, తగిన క్వార్టర్లను తీసుకోగా ఏడుగురు కౌన్సిలింగ్‌కు హాజరై క్వార్టర్లు తీసుకోలేదు. 45మంది కౌన్సిలింగ్‌కు హాజరుకాలేదు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం జీవీ కోటిరెడ్డి, పర్సనల్ మేనేజర్ శివకేశవరావు, డీవైఎస్ఈ సివిల్ అచ్యుత రామయ్య, డీజీఎం ప్రకాశ్, డీవైపీఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ పీవో మురళి, ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బంది పిల్లలకు సత్కారం

కొత్తగూడెం క్రైం, మే 25: పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన పోలీస్ సిబ్బంది పిల్లలను జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఘనంగా సత్కరించారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని ఐఎంఏ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులు, తమ ప్రాంతానికి మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. మెరిట్ సాధించిన 35 మంది పిల్లలను అభినందించారు. ట్రైనీ ఐపీఎస్ విక్రాంత్ సింగ్, కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, ఎంటీవో సుధాకర్, హోంగార్డ్స్ ఆర్ఐ ట్రైనింగ్స్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను సత్కరిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు

359 కేజీల గంజాయి పట్టివేత

బొలేరో వాహనం సీజ్

11 మందిపై కేసు.. కోర్టుకు తరలింపు

వివరాలు వెల్లడించేందుకు పోలీసుల హైడ్రామా

అశ్వారావుపేట, మే 25: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం సాయంత్రం పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 165 ప్యాకెట్లలో 359 కేజీల గంజాయితో పాటు వాహనాన్ని సీజ్ చేశారు. 11 మందిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన విక్రమ్ సింగ్, శైలేంద్ర సింగ్ ఇద్దరు వ్యక్తులకు డబ్బులు, వ